# ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

- కొనసాగుతున్న సమగ్రశిక్ష ఉద్యోగుల సమ్మె
- బైక్ ర్యాలీ నిర్వహించి నిరసన

డీఈవో రాజుకు వినతిపత్రం అందజేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

కామారెడ్డి, డిసెంబర్ 24 : సమగ్ర శిక్ష ఉద్యోగులకు సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట ఉద్యోగులు చేపట్టిన సమ్మె మంగళవారం 15వ రోజుకు చేరుకున్నది. పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించి నిరసన తెలియజేవారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, అప్పటి వరకు పేస్కేల్ అమలు చేయాలని అన్నారు. వంద రోజుల గ్యారెంటీ ఏమైందని ప్రశ్నించారు. ఈ నెల 30వ తేదీన కేబినేట్ సమావేశంలో సమగ్రశిక్ష ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 27వ తేదీ నుంచి టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగులు సమ్మెలో పాల్గొంటారని తెలిపారు. అనంతరం డీఈవో రాజుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, మహిళా అధ్యక్షురాలు వాసంతి, నాయకులు సంపత్, రాములు, సంతోష్ రెడ్డి, శైలజ, కాళీదాసు, వీణ, సాయిలు, లావణ్య, సమగ్రశిక్ష ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# వంద కిలోల నల్లబెల్లం స్వాధీనం

నల్లబెల్లంను స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ పోలీసులు

కామారెడ్డి, డిసెంబర్ 24 : కామారెడ్డి జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి హన్మంత్‌రావు ఆదేశాల మేరకు మంగళవారం మహారాష్ట్ర నుంచి సికింద్రాబాద్‌కు వెళ్లే దేవగిరి ఎక్స్‌ప్రెస్ రైలులో కామారెడ్డి ఎక్సైజ్, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సిబ్బంది సోదాలు నిర్వహించారు. సోదాల్లో వంద కిలోల నల్లబెల్లంను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సీఐ విజయ్‌కుమార్, ఎస్సై విక్రమ్ కుమార్, ఆర్‌పీఎఫ్ సుధాకర్, సిబ్బంది మైసరాజు, సంతోస్, ఆంజనేయులు, రాగ పాల్గొన్నారు.

# ప్రతి మహిళ ఆర్థికాభివృద్ధి సాధించాలి

## కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

బాయంపల్లి గ్రామంలో చేపల పెంపకం యూనిట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

లింగంపేట, డిసెంబర్ 24 : స్వయం సహాయక సంఘంలో ప్రతి మహిళ ఆర్థికాభివృద్ధి సాధించాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ సూచించారు. లింగంపేట మండలంలోని బాయంపల్లి గ్రామంలో స్వయం సహాయక సంఘం మహిళలు ఏర్పాటు చేసిన చేపల పెంపకం యూనిట్‌తోపాటు దాణా తయారీ యూనిట్‌ను కలెక్టర్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించడానికి ప్రభుత్వం బ్యాంకుల ద్వారా రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. మహిళలు తీసుకున్న రుణాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం చేపలు, గొర్రెలు, మేకల పెంపకానికి రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. గ్రామానికి చెందిన కుంట యశోద రూ.3.50 లక్షలు స్త్రీనిధి ద్వారా రుణం తీసుకుని ఏర్పాటు చేసిన యూనిట్‌ను కలెక్టర్ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామంలో చేపలు, గొర్రెలు, మేకలకు, ఆవులకు దాణా తయారీ యూనిట్‌ను పరిశీలించారు.

స్వయంగా దాణా తయారీ చేస్తున్న యువకుడు సాయిలును కలెక్టర్ అభినందించారు. స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవడంతో ఆర్థిక స్థోమత పెరుగుతుందన్నారు. దాణా తయారీ ఉత్పత్తి పెంచడానికి రుణం అందించాలని సాయిలు కలెక్టర్‌ను కోరగా వెంటనే స్పందించి రుణ సదుపాయం కల్పించాలని అధికారులకు సూచించారు. సాయిలు తయారు చేస్తున్న దాణాకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట డీఆర్డీవో సురేందర్, జిల్లా మత్స్యశాఖ అధికారి శ్రీపతి, ఎంపీడీవో నరేశ్, తహసీల్దార్ నరేందర్‌గౌడ్, ఏపీఎం శ్రీనివాస్‌తోపాటు ఆయా శాఖల అధికారులు ఉన్నారు.

# బీటీ రోడ్డు నిర్మాణంతో తప్పిన తిప్పలు

## హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

పూర్తయిన బోర్లం క్యాంపు – బోర్లం బీటీ రోడ్డు నిర్మాణం

బాన్సువాడ రూరల్, డిసెంబర్ 24 : బాన్సువాడ మండలంలోని బోర్లం క్యాంపు నుంచి బోర్లం వరకు రూ.1.30 కోట్లతో చేపట్టిన బీటీ డబుల్ రోడ్డు నిర్మాణ పనులు మంగళవారం పూర్తయ్యాయి. సింగిల్ రోడ్డుగా ఉన్న ఈ రోడ్డు పూర్తిగా ధ్వంసం కావడంతో రెండు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలని రెండు గ్రామాల ప్రజలు గతంలో స్పీకర్‌గా ఉన్న పోచారం శ్రీనివాసరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా గత ప్రభుత్వం రూ.1.30 కోట్లు నిధులు మంజూరు చేసింది. రోడ్డు నిర్మాణ పనులు త్వరగా చేపట్టి పూర్తి చేయడంతో బోర్లం, బోర్లం క్యాంపు గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# మల్బరీ మొక్కలను నాటిన విద్యార్థులు

సౌత్ క్యాంపస్‌లో లేత మల్బరీ మొక్కలను నాటిన విద్యార్థులు

భిక్కనూరు, డిసెంబర్ 24 : తెలంగాణ విశ్వవిద్యాలయం దక్షిణ ప్రాంగణంలోని జంతు శాస్త్ర విభాగానికి చెందిన విద్యార్థులు మంగళవారం మల్బరీ తోట పెంపకం కోసం ఏర్పాటు చేసిన సాగుమడిలో వైస్ ప్రిన్సిపాల్ రాజేశ్వరి, హార్టి అండ్ సెరికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ జ్యోతి ఆధ్వర్యంలో లేత మల్బరీ మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఏడీ జ్యోతి జువాలజీ విభాగాన్ని సందర్శించి పట్టు పురుగుల పెంపకానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. అనంతరం సెరికల్చర్ అధికారి ఐలయ్య జువాలజీ విభాగాధిపతి ప్రసన్నశీల పట్టు పురుగుల పెంపకానికి అవసరమైన అవగాహనతోపాటు విద్యార్థులకు తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు లలిత, సునీల్, విజయ్‌కుమార్, శ్రీకాంత్, సెరి కల్చర్ సిబ్బంది నాగేందర్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేసిన రాష్ట్ర వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాసరెడ్డి

# సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

బాన్సువాడ, డిసెంబర్ 24 : బాన్సువాడ నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన 65 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను రాష్ట్ర వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ తో కలిసి మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గంగాధర్, నాయకులు సురేశ్‌బాబు, ఎజాస్, సాయిరెడ్డి, శంకర్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

# జూనియర్ కళాశాల ఆకస్మిక తనిఖీ

రికార్డులను తనిఖీ చేస్తున్న జిల్లా ఇంటర్మీడియెట్ నోడల్ అధికారి షేక్ సలాం

నస్రుల్లాబాద్, డిసెంబర్ 24 : బీర్కూర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంగళవారం జిల్లా ఇంటర్ విద్యాధికారి షేక్ సలాం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కళాశాలలో అధ్యాపకుల రిజిస్టర్‌ను పరిశీలించారు. అధ్యాపకులు, విద్యార్థుల హాజరుశాతంపై ఆరా తీసిన ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులతో సమావేశమై 90 రోజుల యాక్షన్‌ప్లాన్ ప్రకారం విద్యార్థులు.. అధ్యాపకులు చెప్పిన విధంగా చదవాలన్నారు.

# విరాళం అందజేత

విరాళం అందజేస్తున్న విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు కుసుమ బాలచంద్రం

కామారెడ్డి, డిసెంబర్ 24 : కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లిలో మల్లికార్జున స్వామి కల్యాణ మండపం నిర్మాణానికి మంగళవారం విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు కుసుమ బాల్ చంద్రం రూ.25 వేలు విరాళం అందజేశారు. పేద, మధ్య తరగతి ప్రజల సౌకర్యార్థం శుభకార్యాల కోసం నిర్మిస్తున్న కల్యాణ మండప నిర్మాణానికి విరాళం అందజేయడం ఆనందంగా ఉందని ఆయన అన్నారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గంగారాం, ప్రధాన కార్యదర్శి నవీన్ కుమార్, గౌరవ సలహాదారుడు లక్ష్మీపతి యాదవ్, వీడీసీ ప్రతినిధులు శశిధర్ రావు, మీసాల శ్రీను, మెత్కూరి నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

### ఆర్థిక సహాయం అందజేత

కామారెడ్డి, డిసెంబర్ 24 : కామారెడ్డి మున్సిపల్‌లో కార్మికుడిగా పనిచేస్తున్న పాసుల రేవన్ విధులు నిర్వహించుకొని వెళ్తుండగా యాక్సిడెంట్ కావడంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందూప్రియ మంగళవారం బాధిత కుటుంబానికి రూ.పది వేల ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఎస్సై నగేశ్, యూనియన్ లీడర్ ప్రభువు, రాజనర్సు, కార్మికులు పాల్గొన్నారు.

# జానపద కళాకారుడికి సన్మానం

కామారెడ్డి జిల్లా కళాకారుల సంఘం అధ్యక్షుడి దంపతులను సన్మానిస్తున్న నిర్వాహకులు

లింగంపేట, డిసెంబర్ 24: కామారెడ్డి జిల్లా జానపద కళాకారుల సంఘం అధ్యక్షుడు ఉప్పల విశ్వనాథం దంపతులను రాష్ట్ర జానపద కళాకారుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఘనంగా సన్మానించారు. ఐఏఎస్ అధికారి కేవీ రమణ, జానపద కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, గౌరవ అధ్యక్షుడు కొండల్‌రావు శాలువా కప్పి రూ.రెండు వేల నగదు పురస్కారం అందించారు. వీరితో పాటు జిల్లా కార్యదర్శి ఆనంద్‌రావు, రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాజన్నను సైతం సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ వెన్నెల, సంగీత అకాడమీ చైర్మన్ అలేఖ్య , రాష్ట్ర కార్యదర్శి లింగన్న పాల్గొన్నారు.

# ఏడుగురు పేకాట రాయుళ్ల అరెస్టు

బిచ్కుంద, డిసెంబర్ 24 : పేకాట స్థావరంపై దాడి చేసి పేకాడుతున్న ఏడుగురిని అరెస్టు చేశారు. ఎస్సై భువనేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం.. జుక్కల్ మండలంలోని పెద్దగుల్లా గ్రామ శివారులో పేకాడుతున్నారన్న విశ్వనీయ సమాచారం మేరకు పేకాట స్థావరంపై దాడి చేసి ఏడుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి 57,110 రూపాయలతో పాటు ఏడు సెల్‌ఫోన్లు, మూడు బైకులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

## అన్నాసాగర్‌లో డ్రైనేజీ నిర్మాణం

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 24: మండలంలోని అన్నాసాగర్ గ్రామంలోని ఎస్సీ కాలనీలో మురికికాలువ నిర్మాణం చేపట్టినట్లు ఎంపీటీసీ గురుప్రతాప్ మంగళవారం తెలిపారు. కాలనీలో మురికికాలువలు లేకపోవడంతో కలుగుతున్న ఇబ్బందులను ఎమ్మెల్యే దృష్టికి తేగా రూ.ఐదు లక్షల నిధులు మంజూరు చేసి విడుదల చేసినట్లు తెలిపారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

పాస్‌పోర్ట్ పోయినది

★నేను దొంగమట్టి సృజన్ తండ్రి నర్సయ్య ని॥ ఇ.నెం.2-112/1, కొటార్మూర్, ఆర్మూర్, నిజామాబాద్ నా యొక్క పాస్‌పోర్ట్ నెం. W2992796 గలది తేది: 29-11-2024న ఆర్మూర్ నుండి పెర్కిట్‌కు బైక్ పై ప్రయాణించగా ఎక్కడో పడిపోయినది. ఎవరికైన దొరినవారు సంప్రదించు సెల్: 90306 07949

NTZ-338362

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

# విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలి

- జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి దయానంద్

ఎల్లారెడ్డి మైనారిటీ గురుకుల పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి దయానంద్

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 24: సవరించిన మెనూ ప్రకారం ప్రతిరోజూ భోజనం, స్నాక్స్, పండ్లు అందించాలని జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి దయానంద్ సూచించారు. మంగళవారం ఎల్లారెడ్డి పట్టణంలోని మైనారిటీ గురుకుల పాఠశాలను ఆయన ఆర్ఎల్సీ కిరణ్‌తో కలిసి ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసిన ఆయన విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడి పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. పాఠశాలతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచాలన్నారు. వసతిగృహానికి సంబంధించిన రికార్డులను ఆయన పరిశీలించారు. ఇటీవల నిర్వహించిన సీఎం కప్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించారు. పదోతరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాల విద్యార్థులకు సూచించారు. ఆయనతో పాటు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రఫత్, ఎస్ఎల్సీ బాల్‌రాజ్, బోధన, బోధనేతర సిబ్బంది ఉన్నారు.

# స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేసుకోవాలి

మత్స్యకారుల అవగాహన సదస్సులో మాట్లాడుతున్న అధికారులు

లింగంపేట, డిసెంబర్ 24: గ్రామీణ ప్రాంతాల్లోని మత్స్యకారులు స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేసుకోవాలని జిల్లా మత్స్యశాఖ అధికారి శ్రీపతి సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన మత్స్యకారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లోని మత్స్యకారులు 300 నుంచి 750 మంది వరకు సంఘాలు ఏర్పాటు చేసుకోవచ్చని తెలిపారు. సంఘంలో చేరిన సభ్యులు తన వంతు వాటాగా 2,100 రూపాయలు చెల్లించాలన్నారు. నాబార్డు సైతం సభ్యుడికి రూ.2,100 చెల్లిస్తున్నదని, దీంతో మత్స్యకార్మికులు చేపల పెంపకంతో పాటు వ్యాపార అభివృద్ధి చేసుకోవచ్చని ఆయన సూచించారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యకార్మిక సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ, ఎన్‌జీవో అధికారి గంగాధర్, మత్స్యశాఖ క్షేత్ర సహాయకులు సురేశ్, శ్వేత తదితరులున్నారు.

## అతిథి అధ్యాపక పోస్టుల భర్తీకి

# దరఖాస్తుల ఆహ్వానం

మద్నూర్, డిసెంబర్ 24: మండలకేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టుల భర్తీకి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అశోక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు, ఇంగ్లిష్, బాటనీ, జువాలజీ, కెమిస్ట్రీ సబ్జెక్టులు ఖాళీగా ఉన్నాయని, సంబంధిత సబ్జెక్టులో పీజీలో 55 శాతం మార్కులు కలిగిన వారు అర్హులన్నారు. నెట్, సెట్, పీహెచ్‌డీ అభ్యర్థులకు ప్రాధాన్యం ఉంటుందని, ఈనెల 27 మధ్యాహ్నం మూడు గంటలలోపు బిచ్కుంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

## నేడు అయ్యప్ప సేవా సమితి

# ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

పెద్ద కొడప్‌గల్, డిసెంబర్ 24 : పిట్లం మండల కేంద్రంలో అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు అయ్యప్ప ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నేత్ర వైద్య శిబిరం

కాస్లాబాద్‌లో రోగులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

పెద్ద కొడప్‌గల్, డిసెంబర్ 24 : మండలంలోని కాస్లాబాద్ గ్రామంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కంటి వైద్య నిపుణుడు డాక్టర్ భరత్ మాట్లాడుతూ శిబిరంలో 23 మందికి పరీక్షలు నిర్వహించగా అందులో చూపు మందగించిన 19 మందిని గుర్తించి శస్త్ర చికిత్స కోసం బాన్సువాడ కంటి దవాఖానకు రెఫర్ చేశామన్నారు. కార్యక్రమంలో నాయకులు హైమద్, అంబయ్య, గ్రామ కార్యదర్శి కవిత తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో

# ఒకరికి గాయాలు

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 24: వాకింగ్‌కు వెళ్తున్న యువకుడిని బైక్ ఢీ కొట్టడంతో గాయాల పాలైన ఘటన మంగళవారం ఎల్లారెడ్డి పట్టణంలో చోటు చేసుకున్నది. ఎల్లారెడ్డి ఎస్సై మహేశ్ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఎల్లారెడ్డి బీడీ కాలనీకి చెందిన మామిడి నందు అనే యువకుడు మంగళవారం ఉదయం వాకింగ్‌కు వెళ్తున్న సమయంలో పట్టణంలోని సిద్ధి ప్రకాశ్ రైస్‌మిల్ ఎదుట వెనుక నుంచి బైక్‌పై వేగంగా వచ్చిన ఎల్లారెడ్డిలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన మహ్మద్ మైమూద్ రహమాన్ ఢీ కొట్టాడు. ప్రమాదంలో నందుకు ఎడమ చేతికి, ఎడమవైపు పక్క ఎముకలకు గాయాలయ్యాయి. నందు తండ్రి మామిడి లింగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేశ్ తెలిపారు.

## కళ్యాణి గ్రామంలో

# ఈజీఎస్ సభ

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 24: మండలంలోని కళ్యాణి గ్రామపంచాయతీ కార్యాలయంలో మంగళవారం ఈజీఎస్ గ్రామసభ నిర్వహించారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనుల వివరాలను గ్రామసభలో చదివి వివరించారు. గ్రామసభలో ఎంపీడీవో ప్రకాశ్, సోషల్ ఆడిట్ బృందం, గ్రామ కార్యదర్శి సుధారాణి, ఉపాధికూలీలు తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణి గ్రామపంచాయతీ కార్యాలయంలో ఈజీఎస్ గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు

# ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం.. కాయిల్స్ చోరీ

సాతెల్లి గ్రామంలో చోరీకి గురైన ట్రాన్స్‌ఫార్మర్

ఎల్లారెడ్డిరూరల్, డిసెంబర్ 24: మండలంలోని సాతెల్లి గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్ చోరీకి గురైంది. సీనియర్ లైన్‌ఇన్‌స్పెక్టర్ సిద్ధేందర్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. గ్రామ శివారులోని వైకుంఠధామం వద్ద ఉన్న ఎస్సెస్ 2-16 కేవీఏ కెపాసిటీ ట్రాన్స్‌ఫార్మర్ సోమవారం అర్ధరాత్రి సమయంలో చోరీకి గురైంది. ఉదయాన్నే గ్రామస్తులు విషయాన్ని లైన్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్‌కు తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసిన దుండగులు దానిలోని 35వేల రూపాయల విలువైన కాపర్ కాయిల్స్ దొంగిలించారు. విషయాన్ని పోలీసులకు తెలుపగా వారు పంచనామా చేసి వివరాలను నమోదు చేసుకొన్నట్లు ఆయన తెలిపారు.

## వివాహిత అదృశ్యం

జ్యోతి (ఫైల్)

లింగంపేట(తాడ్వాయి), డిసెంబర్ 24: తాడ్వాయి మండలంలోని కృష్ణాజివాడి గ్రామానికి చెందిన ఓ మహిళ రెండు రోజుల క్రితం అదృశ్యమైంది. తాడ్వాయి ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపిన ప్రకారం.. మండలంలోని దేమెకలాన్ గ్రామానికి చెందిన జ్యోతికి కృష్ణాజివాడికి చెందిన సందీప్‌రాజుతో వివాహమైంది. ఈ నెల 20న భార్యాభర్తలు దేమెకలాన్ గ్రామానికి వచ్చారు. 22వ తేదీ తెల్లవారుజామున జ్యోతి కాలకృత్యాలు తీర్చుకోవడానికి ఇంట్లోంచి బయటికి వెళ్లింది. ఇంట్లోంచి వెళ్లిన జ్యోతి తిరిగిరాకపోవడంతో బంధువులు, స్నేహితుల ఇండ్లవద్ద గాలించినా ఆచూకీ లభించలేదు. జ్యోతి తల్లి నీరడి కరుణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

## అనారోగ్యంతో ఒకరి ఆత్మహత్య

లింగంపేట, డిసెంబర్ 24: మండలంలోని మోతె గ్రామానికి చెందిన లాల్‌సారి కిష్టయ్య (55) ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై సుధాకర్ కథనం ప్రకారం.. మండలంలోని కొండాపూర్ గ్రామానికి చెందిన కిష్టయ్య మోతె గ్రామానికి ఇల్లరికం వచ్చాడు. కిష్టయ్య భార్య గతంలో మృతి చెందింది. అప్పటి నుంచి కుమారుడి వద్ద ఉంటున్న కిష్టయ్య కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దవాఖానలకు తిరిగినప్పటికీ ఆరోగ్యం కుదుట పడకపోవడంతో కలత చెంది ఇంట్లో దూలానికి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుమారుడు సాగర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎల్లారెడ్డికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

## చోరీ కేసులో నిందితుడి రిమాండ్

లింగంపేట, డిసెంబర్ 24: మండలంలోని నల్లమడుగు గ్రామంలో వారం రోజుల క్రితం జరిగిన చోరీ కేసులో నిందితుడిని పట్టుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై సుధాకర్ మంగళవారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. గ్రామాని కి చెందిన అబ్దుల్ రహీం బంధువుల ఇంటికి వెళ్లిన స మయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళం పగులగొట్టి బీరువాలో నుంచి వెండి, బంగారు ఆభరణాలు అపహరించుకుపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టి గాంధారికి చెందిన ర్యాపని అలియాస్ ఒడ్డె సాయిలుగా గుర్తించారు. మంగళవారం లింగంపేట బస్టాండ్‌లో సాయిలును గుర్తించి విచారించగా చోరీకి పాల్పడినట్లు నేరం అంగీకరించాడు. నిందితుడి నుంచి వెండి, బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు.

## చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 24: బాధిత కుటుంబ సభ్యులకు మంగళవారం ఎల్లారెడ్డి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు చెక్కులను పంపిణీ చేశారు. ఇటీవల విద్యుత్ ప్రమాదానికి గురై మృతి చెందిన లింగంపేట్‌కు చెందిన కొట్టూరి చంద్రకళ, కొయ్యగుట్ట తండాకు చెందిన కేతావత్ అంజిల కుటుంబీకులకు ప్రభుత్వం ప్రకటించిన ఎక్స్‌గ్రేషియా చెక్కులను అందజేశారు.